సాక్షి నల్లగొండ

శుక్రవారం । 12 । జనవరి । 2024



సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

సంక్రాంతి సందర్భంగా ఈనెల 12, 13, 14 తేదీల్లో ఆర్టీసీ 400 ప్రత్యేక బస్సు సర్వీసులను నడపనుంది. - 8లో



దొంగల ముఠా అరెస్టు

తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న ముఠాను నకిరేకల్ పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



ఆరాధన క్షేత్రం.. బుద్ధవనం

బుద్ధవనం.. బౌద్ధ ఆరాధన క్షేత్రంగా విరాజిల్లనుందని జమ్మూకశ్మీర్ హైకోర్టు జడ్జి తషి రబ్‌స్తాన్ అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

గొర్రెల యూనిట్లు పంపిణీ చేయాలి

నల్లగొండ టౌన్: డీడీలు చెల్లించిన లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లు పంపిణీ చేయాలని లేని పక్షంలో డీడీల డబ్బులను తిరిగి వాపస్ ఇవ్వాలని గొర్రెల పెంపకందారుల సంఘం (జీఎంపీఎస్) జిల్లా గౌరవాధ్యక్షుడు బండా శ్రీశైలం, జిల్లా కార్యదర్శి అవిశెట్టి శంకరయ్య కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిప్పర్తి మండలం సర్వారం గ్రామానికి చెందిన 60 మంది గొర్రెల యూనిట్ల కోసం డీడీలు చెల్లించి యూనిట్ల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. వినతపత్రం ఇచ్చిన వారిలో మన్నె భిక్షం, కుంటిగొర్ల నాగరాజు, నాగయ్య, శీనయ్య, యాదయ్య, జానయ్య, యాదగిరి, శంకర్, రాములు, వెంకటయ్య, మల్లయ్య, చంద్రయ్య ఉన్నారు.

చెర్వుగట్టులో లక్ష పుష్పార్చన



లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

నార్కట్‌పల్లి: మండలంలోని చెర్వుగట్టు గ్రామంలో గల శ్రీపార్వతి జడలరామలింగేశ్వర స్వామి ఆలయం గురువారం రాత్రి భక్తులతో కిక్కిరిసి పోయింది. అమవాస్య కావడంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి ఆలయ అర్చకులు లక్ష పుష్పార్చన, ప్రత్యేక పూజలను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, సతీష్ శర్మ, సురేష్ శర్మ, శ్రీకాంత్ శర్మ, ఈఓ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబురం



నకిరేకల్ పట్టణంలోని శాస్త్ర స్కూల్‌లో గురువారం నిర్వహించిన సంక్రాంతి సంబురాల్లో పాల్గొన్న చిన్నారులు, ఉపాధ్యాయురాలు

పండుగ రద్దీ



సంక్రాంతి సెలవులు రావడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సొంతూళ్లకు బయలుదేరారు. దీంతో గురువారం నల్లగొండ బస్టాండ్‌లో రద్దీ నెలకొంది.

నిధులు గోల్‌మాల్!

పంచాయతీల సొమ్ము ఎంపీడీఓ కాజేసినట్లు సర్పంచ్‌ల ఫిర్యాదు

- సర్పంచ్‌ల డిజిటల్ కీ వినియోగించి యథేచ్ఛగా డ్రా
- నిధులు దుర్వినియోగంపై జెడ్పీ డిప్యూటీ సీఈఓ విచారణ



ఎంపీడీఓ రాములునాయక్ నుంచి వివరాలు సేకరిస్తున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

చందంపేట : ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టలేడన్నట్లుగా తయారైంది చందంపేట మండల పాలన వ్యవస్థ. ఎంపీడీఓ కార్యాలయం కేంద్రంగా అందులో పనిచేసే అధికారులు నిధులు గోల్‌మాల్ చేస్తున్నారు. గతంలోనూ చందంపేట ఎంపీడీఓ రాములునాయక్‌పై పలు అవినీతి ఆరోపణలు ఉన్నా.. ఆయన తీరులో మార్పు రాలేదు. గతంలో ఉపాధి హామీ నిధులు రూ.కోట్లలో దుర్వినియోగం జరగ్గా.. అప్పట్లో సామాజిక తనిఖీ సమయంలో రికార్డులు కూడా అందుబాటులో లేకుండాపోవడం చర్చనీయాంశంగా మారింది. ఇంత జరుగుతున్నా కార్యాలయ అధికారులు, ఎంపీడీఓ తీరు మారకపోవడం సర్వత్రా చర్చ కొనసాగుతోంది. తాజాగా మండలంలోని సుమారు 20 గ్రామ పంచాయతీలకు సంబంధించి రూ.లక్షల్లో నిధుల దుర్వినియోగానికి గురైనట్లు వెలుగులోకి వచ్చింది.

డిజిటల్ కీని ఎంపీడీఓ కార్యాలయంలోనే..

సాధారణంగా గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులకు సంబంధించి నిధుల విడుదల సమయంలో డిజిటల్ కీని వినియోగిస్తుంటారు. అయితే చందంపేట మండలంలో మాత్రం సర్పంచ్‌ల వద్ద ఉండాల్సిన డిజిటల్ కీ చందంపేట ఎంపీడీఓ కార్యాలయ అధికారులు తమ వద్దే ఉంచుకొని సర్పంచ్‌లకు సమాచారం ఇవ్వకుండా ఇష్టానుసారంగా నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలోనే మండలంలోని పొగిళ్ల, గన్నెర్లపల్లి, పాత కంబాలపల్లి, గుంటిపల్లి తదితర గ్రామ పంచాయతీలకు సంబంధించి రూ.లక్షల్లో నిధుల దుర్వినియోగం జరిగిందని పేర్కొంటూ గుంటిపల్లి సర్పంచ్ శంకర్‌రావు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం జెడ్పీ డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్‌రెడ్డి ఎంపీడీఓ కార్యాలయంలో విచారణ నిర్వహించి వివరాలు సేకరించారు.

తీరుమారని ఎంపీడీఓ

చందంపేట ఎంపీడీఓ రాములునాయక్‌పై గతంలోనూ పలు విమర్శలు, అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఉపాధి హామీ పథకానికి సంబంధించి సుమారు రూ.30కోట్ల మేర నిధుల దుర్వినియోగం జరగ్గా, ఇందుకు సంబంధించిన పత్రాలు సైతం అందుబాటులో లేకుండా చేశారని ప్రధాన ఆరోపణ. ఈ క్రమంలో ఓపెన్ ఫోరంలో రూ.30 కోట్ల అవినీతి జరిగినట్లు అధికారులు గుర్తించగా, ఇందుకు సంబంధించిన పత్రాలు మాయం కాగా అధికారులపై కేసు నమోదైంది. తాజాగా గ్రామ పంచాయతీల నిధుల దుర్వినియోగం వెలుగులోకి రావడంతో ఎంపీడీఓ కార్యాలయ అధికారులు, ఎంపీడీఓ పనితీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదేగాకుండా మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పర్యవేక్షిస్తున్నట్లు చూపిస్తూ తన సొంత కారుకు మెయింటనెన్స్, ఇతర ఖర్చుల కింద నెలకు రూ.30వేలు డ్రా చేస్తున్నట్లు తెలిసింది. ఇదిలా ఉంటే డిప్యూటీ సీఈఓ విచారణపై తమకు నమ్మకం లేదని తాము కలెక్టర్‌ను కలిసి నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు చేయనున్నట్లు ఆయా గ్రామాల సర్పంచ్‌లు పేర్కొంటున్నారు.

‘స్వచ్ఛత’లో మెరిసిన నీలగిరి

- జాతీయ స్థాయిలో 92.. రాష్ట్రంలో 3వ ర్యాంకు కైవసం
- స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులు ప్రకటించిన కేంద్రం



నల్లగొండలో రోడ్డు వెంట చెత్త, రాళ్లను తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు (ఫైల్)

నల్లగొండ టూటౌన్: కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాకింగ్‌లో నీలగిరి మున్సిపాలిటీ సత్తా చాటింది. పెద్ద, పెద్ద నగరాలను వెనక్కి నెట్టి జాతీయ స్థాయిలో 92 ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకు సాధించింది. ఇంటింటా చెత్త సేకరణ, నివాస, వాణిజ్య ప్రాంతాల పరిశుభ్రత, పబ్లిక్ టాయిలెట్స్ తదితర విభాగాల నిర్వహణలో నీలగిరి మున్సిపాలిటీ ముందంజలో నిలిచి జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో ర్యాంకులు కైవసం చేసుకుంది. స్వచ్ఛ సర్వేక్షణ్–2023కు సంబంధించి మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన ర్యాంకుల్లో నీలగిరికి చోటు దక్కింది. గతంలో ఎప్పుడూలేని విధంగా ఈసారి రాష్ట్ర స్థాయిలో హైదరాబాద్, కరీంనగర్ కార్పొరేషన్ల తర్వాత నీలగిరి మున్సిపాలిటీ 3వ స్థానం దక్కించుకుంది. అలాగే జాతీయ స్థాయిలో 92వ ర్యాంకు సాధించింది.

446 మున్సిపాలిటీలు పోటీ పడగా..

స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో దేశంలో లక్ష జనాభాకు పైబడిన 446 మున్సిపాలిటీలు పోటీ పడ్డాయి. జాతీయ స్థాయిలో నీలగిరి మున్సిపాలిటీ 92 ర్యాంకు దక్కించుకుంది. అదే విధంగా రాష్ట్రంలో 11 మున్సిపాలిటీలు పోటీ పడగా జీహెచ్ఎంసీకి మొదటి స్థానం, కరీంనగర్‌కు రెండో స్థానం, నీలగిరి మున్సిపాలిటీకి మూడో స్థానం దక్కింది.

అందరి సహకారంతోనే సాధ్యమైంది



“ మున్సిపాలిటీ పాలకవర్గం, అధికారులు, కార్మికులందరి సహకారంతోనే నీలగిరి ఈ ఏడాదిలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జాతీయ స్థాయిలో 92, రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకులు సాధించింది. ఉత్తమ ర్యాంకుల సాధనలో భాగస్వాములైన వారందరికీ ప్రత్యేక కృతజ్ఞలు.

– కందుకూరి వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్, నల్లగొండ

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న చింతల రామచంద్రారెడ్డి

నల్లగొండ టూటౌన్: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని బీజేపీ నల్లగొండ పార్లమెంట్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నల్లగొండ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అధిష్టానం ఎవరికి సీటు వచ్చినా ఆ అభ్యర్థి గెలుపునకు కృషిచేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకోవాలని సూచించారు. 14న స్వచ్ఛ దేవాలయం, అయోధ్య రామాలయం అక్షింతలు పంపిణీ, 22న జ్యోతి జలాప్ కార్యక్రమాల్లో ప్రజలందరినీ భాగస్వాములను చేయాలన్నారు. ఈ సమావేశంలో నల్లగొండ పార్లమెంట్ కన్వీనర్ బండారు ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి, నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, వీరెల్లి చంద్రోఖర్, నూకల నరసింహారెడ్డి, కంకణాల నివేదితరెడ్డి, గార్లపాటి జితేంద్రకుమార్, మన్నెం రంజిత్ యాదవ్, పోతెపాక సాంబయ్య, షేక్ బాబా పాల్గొన్నారు.

పోటీకి సై అన్న పదిమంది నేతలు

నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి చింతల రామచంద్రారెడ్డి ఎంపీగా పోటీ చేసే అభ్యర్థులు చేతులు పైకి ఎత్తాలని కోరగా 10 మంది అభ్యర్థులు చేతులెత్తారు. పార్టీలో పోటీ బాగానే ఉందని, అధిష్టానం ఎవరికి టికెట్ ఇచ్చినా అందరు కలిసి పని చేయాలని సూచించారు. ఈ పది మందిలో ఒక మహిళా నాయకురాలు కూడా ఉన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

- కలెక్టర్ హరిచందన



మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

నల్లగొండ: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య, మహిళా, శిశు సంక్షేమ శాఖ, మెడికల్ కళాశాల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ కాన్పుల సంఖ్య పెంచాలన్నారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు హేమంత్ కేశవ్ పాటిల్, జె.శ్రీనివాస్, డీఎంహెచ్ఓ డాక్టర్ కొండల్‌రావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజకుమారి, మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో ఉంటూ చదువుతున్న విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ హరిచందన అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఆయా శాఖలు, ఉద్యాన శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. హాస్టళ్లలో విద్యుత్‌ను ఆదా చేసేందుకు భవనాలపై సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. ఉద్యాన శాఖ ద్వారా ఆయిల్ పాం సాగు జిల్లాకు కేటాయించిన లక్ష్యం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఉద్యాన శాఖ అధికారి సంగీత లక్ష్మి, డీటీడీఓ రాజ్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్, బీసీసంక్షేమ అధికారి ఖాజానజీం అలీ, మైనార్టీ సంక్షేమ అధికారి విజయేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓటరు జాబితా సిద్ధం చేయాలి

త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికలతోపాటు, వరంగల్– ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి ఓటరు జాబితా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్‌లో అదనపు కలెక్టర్లు హేమంత్ కేశవ్ పాటిల్, జె.శ్రీనివాస్‌తో కలిసి ఏఈఆర్‌ఓలు, తహసీల్దార్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఓటరుగా నమోదుకు ఈనెల 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు ఫారం 6 ద్వా 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు ఓటరుగా నమోదైన వారుకూడా కొత్తగా ఫారం–18 ద్వారా ఫిబ్రవరి 6 లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 2020 నవంబర్ 1న నాటికి డిగ్రీ పూర్తి చేసి వారు అర్హులనాన్నరు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్ తరాల పరమేశ్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టర్ పశు సంవర్ధక శాఖ, విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. ఆయా శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశాల్లో పశు సవర్ధక శాఖ డాక్టర్ శ్రీనివాస్, జిల్లా విద్యాశాఖ అధికారి బి.భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

వెలిమినేడు పీఏసీఎస్ చైర్మన్‌గా రఘుమారెడ్డి



రఘుమారెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

చిట్యాల: మండలంలోని వెలిమినేడులోని పీఏసీఎస్ చైర్మన్‌గా ఏనుగు రఘుమారెడ్డి ఎన్నికయ్యారు. గురువారం కొత్త చైర్మన్ ఎన్నిక కోసం పీఏసీఎస్ కార్యాలయంలో డీసీఓ కిరణ్‌కుమార్ సమక్షంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి 13 మంది డైరెక్టర్‌లకు గాను మొత్తం 11 మంది డైరెక్టర్లు హాజరై రఘుమారెడ్డికి మద్దతు తెలిపారు. దీంతో రఘుమారెడ్డి చైర్మన్‌గా ఎన్నికైనట్లు డీసీఓ ప్రకటించారు. రఘుమారెడ్డిని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, డైరెక్టర్లు అభినందనలు తెలిపిసన్మానించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లమ్మ పాపయ్య, చిట్యాల మున్సిపల్ చైర్మన్ చినవెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయక కోణం



కోణం సాందీప్



- ఆర్టిఫీషియల్ ఇంటలీజెన్స్‌లో సత్తా చాటుతున్న కోణం సాందీప్
- డాక్టర్లు, పేషంట్లకు ఉపయోగపడేలా యాప్ రూపకల్పన
- ఇప్పటికే అమెరికాలోని ప్రతిష్టాత్మక ఫోర్బ్స్ మ్యాగజైన్‌లో చోటు
- అమెరికా, కెనడాతో పాటు నల్లగొండలోనూ ఐటీ కంపెనీల స్థాపన
- స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న 29 ఏళ్ల యువకుడు
- నేడు జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా సాందీప్ సక్సెస్‌పై స్పెషల్ స్టోరీ



సాక్షి, నల్లగొండ డెస్క్ :

‘లేచి నిలబడు, ధైర్యం వహించు, బలవంతుడివికా.. బాధ్యతనంతా నీ భుజాలపైనే వేసుకుని, నీ విధికి నీవే కర్తవని తెలుసుకో. నీకు కావలసిన బలం, సహాయం అంతా నీలోనే ఉంది. అందుకే నీ భవితవ్యాన్ని నీవే నిర్మించుకో’ అని స్వామి వివేకానంద చెప్పిన సూక్తిని ఆ యువకుడు అక్షరాలా ఆచరించాడు. ఆర్టిఫీషియల్ ఇంటలీజెన్స్‌లో తన పరిశోధనలతో ప్రపంచ అగ్రరాజ్యమైన అమెరికా దృష్టిని ఆకర్షించి ప్రతిష్టాత్మక ఫోర్బ్స్ మ్యాగజైన్‌లో చోటు దక్కించుకున్నాడు. స్వస్థలంపై మమకారంతో ఫౌండేషన్ ఏర్పాటు చేసి ఇంజనీరింగ్ పట్టభద్రులకు మెళకువలు నేర్పించి ఉపాధికి బాటలు వేస్తున్నాడు. ఉద్యోగంతో సంతృప్తి చెందని ఆ యువకుడు తానే స్వయంగా ఐటీ కంపెనీలు స్థాపించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నాడు. నేడు జాతీయ యువజన దినోత్సవం (స్వామి వివేకానంద జయంతి) సందర్భంగా.. నల్లగొండ జిల్లా కట్టంగూరుకు చెందిన కోణం సాందీప్‌పై ప్రత్యేక కథనం.



సాందీప్ పదవ తరగతి వరకు నల్లగొండలో చదివాడు. వైఎస్సార్ కడప జిల్లా ఇడుపులపాయలోని ట్రిబుల్ ఐటీ(ఆర్‌జీయూకేటీ)లో సీటు పొంది ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో బీటెక్‌తో పాటు కంప్యూటర్ సైన్స్‌లో మైనర్ డిగ్రీ కూడా పూర్తి చేశాడు. ఆ తర్వాత అమెరికాలోని ప్రపంచస్థాయిలో ప్రథమ స్థానంలో ఉన్న కార్నెగీ మెలన్ యూనివర్సిటీ (సీఎంయూ)లో ఎంఎస్ రీసెర్చ్ ఇన్ రోబోటిక్స్‌లో అడ్మిషన్ పొందాడు. 2017లో ఎంఎస్ పూర్తయిన తర్వాత అక్కడే ఫీట్‌బర్గ్‌లోని యూపీఎంసీ కంపెనీలో సీనియర్ ప్రాడక్ట్ మేనేజర్‌గా ఉద్యోగంలో చేరాడు. అయితే, ఉద్యోగంతో సంతృప్తి చెందని సాందీప్.. 2018లో ‘ఆబ్రిడ్జ్’ పేరుతో కంపెనీ నెలకొల్పాడు. ఆర్టిఫీషియల్ ఇంటలీజెన్స్ (ఏఐ)పై రీసెర్చ్ చేసి డాక్టర్స్, పేషెంట్స్‌కు ఉపయోగపడే విధంగా యాప్ రూపొందించాడు. అప్పటి వరకు ఎవరూ చేయని విధంగా ఈ యాప్ ఉండడంతో అమెరికాలో పేటెంట్ వచ్చింది. వైద్యులు రాసే సమాచారాన్ని అత్యంత స్పష్టంగా, భద్రంగా రోగులకు వారి మాతృభాషలోనే తర్జుమా చేస్తుంది. దాంతో పాటు వైద్య నిపుణులు ఇచ్చే సలహాలు, సూచనలు రోగులు గుర్తుంచుకొని, అర్థం చేసుకుని పాటించేలా ఈ యాప్ రూపకల్పన చేశాడు. 2020 అక్టోబర్‌లో యాప్‌ను పూర్తిస్థాయిలో విడుదల చేశాడు.

కరోనా కాలంలో..

ఈ యాప్‌పై అమెరికాలోని పలు యూనివర్సిటీల్లో సాందీప్ ఉపన్యాసాలు కూడా ఇచ్చాడు. కరోనా కాలంలో ఈ యాప్ వైద్యులకు, రోగులకు బాగా ఉపయోగపడింది. దీంతో మరింత గుర్తింపు వచ్చింది. ఆయన టీం అమెరికాతో పాటు కెనడాలో కూడా ఉంది. తరువాత హిట్లూప్, కోణం ఫౌండేషన్ సంస్థలను స్థాపించాడు. ఇతర దేశాల నుంచి కూడా ఆఫర్స్ వస్తున్నాయని, తర్వలో మరికొన్ని దేశాల్లో తన కంపెనీని స్టార్ట్ చేస్తానని సాందీప్ చెప్పాడు.



చదువుకునే సమయంలోనే రోబోటిక్స్‌పై పరిశోధన

ప్రస్తుతం ప్రపంచమంతా రోబోటిక్స్ మీద దృష్టిపెట్టింది. రోబోటిక్స్‌పై సాందీప్ తాను చదువుకునే సమయంలోనే పరిశోధనలు మొదలుపెట్టాడు. పదేళ్లకు పైగానే దీనిపై ఆయన పరిశోధన చేస్తున్నాడు. వ్యవసాయం, విద్యా రంగాలపై తన దృష్టిపెట్టాడు. వ్యవసాయంలో ముఖ్యంగా పత్తి పంటలో మెరుగైన పద్ధతులను సాంకేతికంగా ఎలా విస్తరించాలని, రైతులకు ఎలా అవగాహన కల్పించాలనే వాటిపై పరిశోధన సాగిస్తున్నారు. విద్యా రంగంలో మూగ వారి కోసం అవసరమయ్యే ఉపకరణాలపై పరిశోధన చేస్తున్నాడు.

నల్లగొండ ఐటీ హబ్‌లో మొదటి కంపెనీ ఇదే..

నల్లగొండలో ఐటీ కంపెనీ పెట్టాలని కొన్ని రోజులుగా ఆలోచన చేస్తుండగా.. ఇటీవల ఐటీ హబ్ ప్రారంభమైంది. ఇందులో సాందీప్‌కు చెందిన హిట్లూప్ కంపెనీయే మొదటిది. హైదరాబాద్‌లోని ఐటీ కంపెనీల్లో నల్లగొండ వారే ఎక్కువగా ఉన్నారు. స్థానికంగా కొందరు టాలెంట్ ఉన్నా హైదరాబాద్‌కు రాలేకపోతున్నారని గుర్తించి ఇక్కడే ఐటీ కంపెనీ ప్రారంభించాలని భావించాడు. స్థానిక యువతకు ఐటీ పరంగా యూనివర్సిటీలో అభ్యసన అంతగా ఉండదు కాబట్టి వారికి తాను 2016లో స్థాపించిన కోణం ఫౌండేషన్ ద్వారా మెళకువలు నేర్పుతున్నాడు. ఈ ఫౌండేషన్ ద్వారా ఫెలోషిప్ కూడా ఇస్తున్నాడు. ఇటీవల కడప జిల్లాలో ఫెలోషిప్ ప్రారంభించాడు. ఆర్టిఫీషియల్ ఇంటలీజెన్స్ (ఏఐ)లో ఆసక్తి ఉన్న వారికి శిక్షణ పొందే విధంగా తయారు చేస్తున్నారు.



నల్లగొండ ఐటీ హబ్‌లోని సాందీప్ కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగులు

క్లుప్తంగా

14న గోదాదేవి కల్యాణం


అలంకార సేవను ఊరేగిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 14వ తేదీన గోదాదేవి–శ్రీరంగ నాథుడి కల్యాణ వేడుకను నిర్వహించనున్నారు. రాత్రి 7గంటలకు ఆలయ ముఖ మండపంలో కల్యాణ తంతును ఆచార్యులు పాంచారాత్ర ఆగమ శాస్త్రానుసారంగా జరిపించనున్నారు. మరుసటి రోజు అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమాన్ని ఆచార్యులు చేపడతారు. కాగా.. గోదాదేవి నీరాటోత్సవాల్లో భాగంగా గురువారం ఆలయంలో నిత్య కల్యాణ సేవతో పాటు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి సేవను ఆలయ తిరు, మాఢ వీధిలో ఊరేగించారు. అనంతరం అమ్మవారికి ఇష్టమైన నైవేధ్యాన్ని సమర్పించారు.

ఆటో, బైక్ ఢీ.. ఇద్దరు మృతి


చంద్రయ్య (ఫైల్)


నవీన్‌కుమార్ (ఫైల్)

నకిరేకల్: ఆటో, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతిచెందారు. ఈ ఘటన నకిరేకల్ మండలం తాటికల్ శివారులో బుధవారం రాత్రి జరిగింది. గురువారం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం చిన్ననాగారం గ్రామానికి చెందిన బక్కతట్ల చంద్రయ్య(45) నల్లగొండలో వ్యాపారం చేసుకుంటున్న తన అన్న వద్దకు ఆటోలో బియ్యం వేసుకొని బుధవారం సాయంత్రం బయల్దేరాడు. మార్గమధ్యలో నకిరేకల్ మండలం తాటికల్ గ్రామ శివారుకు చేరుకోగానే సూర్యాపేటకు చెందిన యలగందుల నవీన్(30) పని నిమిత్తం నల్లగొండకు వచ్చి తిరిగి సూర్యాపేటకు బైక్ వెళ్తుండగా ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో నవీన్‌కుమార్ తలకు బలమైన తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటో నడుపుతున్న బక్కతట్ల చంద్రయ్యకు తీవ్ర గాయాలు కావడంతో నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ రాజశేఖర్, ఎస్‌ఐలు సుధీర్, గోపికృష్ణ తెలిపారు.

సాగర్‌లో కరోనా కేసు

నాగార్జునసాగర్: నందికొండ మున్సిపాలిటీలో గురువారం కరోనా కేసు నమోదైంది. కమలానెహ్రూ ఏరియా ఆస్పత్రిలో 22మందికి కరోనా పరీక్షలు చేయగా.. ఒకరికి పాజిటివ్ వచ్చినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. మాస్కులు ధరించాలని డాక్టర్లు సూచించారు.

• మొదలైన పండుగ రద్దీ

సంక్రాంతి పండుగ నేపథ్యంలో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం నుంచి రద్దీ పెరిగింది. శుక్రవారం నుంచి విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించడంతో గురువారం సాయంత్రం నుంచే ప్రజలు సొంతూళ్లకు వెళ్తున్నారు. దీంతో బస్టాండ్లలో రద్దీ నెలకొంది. వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకొని పంతంగి జీఎంఆర్ టోల్‌ప్లాజా వద్ద నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. విజయవాడ వైపునకు పది టోల్ ద్వారాలను తెరిచి ఉంచారు.


చౌటుప్పల్: విజయవాడ జాతీయ రహదారిపై బారులుదీరిన వాహనాలు


నల్లగొండ బస్టాండ్‌లో బస్సులు ఎక్కేందుకు కిక్కిరిసిన ప్రయాణికులు


కుటుంబంతో కలిసి ఊరెళ్లేందుకు నల్లగొండ బస్టాండ్‌కు వస్తున్న ప్రయాణికుడు


భువనగిరి బస్టాండ్‌లో బస్సు ఎక్కేందుకు వస్తున్న విద్యార్థులు

సంక్రాంతికి 400 ప్రత్యేక బస్సులు

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 12, 13, 14 తేదీల్లో నడపనున్న ఆర్టీసీ అధికారులు
- ఇతర రాష్ట్రాలకు ప్రత్యేక బస్సులు నిల్
- మహిళలకు ఉచితంగానే ప్రయాణం


భువనగిరిలో కిటకిటలాడుతున్న ప్రయాణికులు

నల్లగొండ రూరల్: సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ నెల 12, 13, 14 తేదీల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 400 బస్సులు ప్రత్యేకంగా నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అందుకు అనుగుణంగా అన్ని డిపోల నుంచి 10 బస్సుల చొప్పున ప్రత్యేకంగా నడపనున్నారు. ఈ బస్సుల్లో సైతం మహిళలకు ఉచిత ప్రయాణమే అమలు చేయనున్నారు. గతంలో సంక్రాంతి పండుగకు 350 బస్సులను ప్రత్యేకంగా నడిపేవారు, కానీ ఈసారి మహిళలకు ఉచిత ప్రయాణం అమలులో ఉండడంతో అదనంగా మరో 50 బస్సులను నడుపుతున్నారు. ఈసారి డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సుల్లో కూడా సాధారణ టికెట్ ధరనే ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు.

పెరిగిన ప్రయాణికుల సంఖ్య..

ఉచిత బస్సు ప్రయాణంతో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగింది. గతంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోజుకు 1.75 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించగా.. ఇందులో 70 వేల మంది మహిళలు ప్రయాణించేవారు. ఉచిత ప్రయాణంతో ప్రస్తుతం రోజుకు 3లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నట్లు అధికారులు లెక్కలు వేశారు. ఇందులో 2లక్షల మంది మహిళా ప్రయాణికులే ఉన్నారని నిర్ధారించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 7 డిపోల నుంచి 649 బస్సులు ఉండగా అందులో ఎక్స్‌ప్రెస్ 69, డీలక్స్ 70, సూపర్ లగ్జరీ 48, పల్లె వెలుగు బస్సులు 462 ఉన్నాయి. ప్రతి రోజు 2,47,899 కి.మీ. దూరం బస్సులు నడిపి ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేరవేస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

మహిళా ప్రయాణికులు పెరిగారు



మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అందుబాటులో ఉండటంతో గతంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోజుకు 70 వేల మంది మహిళలు ప్రయాణిస్తే ఇప్పుడు 2లక్షల మంది మహిళలు ప్రయాణం చేస్తున్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని సంక్రాంతి పండుగకు తగిన ఏర్పాట్లు చేశాం. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకంగా బస్సులు నడపడంలేదు. గతం తరహాలోనే ఆయా డిపోల పరిధిలో బస్సులు నడుపుతాం.

– శ్రీదేవి, రీజినల్ మేనేజర్, నల్లగొండ

ఇతర రాష్ట్రాలకు లేవు..

దేవరకొండ, నల్లగొండ, కోదాడ, నార్కట్‌పల్లి, సూర్యాపేట, మిర్యాలగూడ, యాదగిరిగుట్ట డిపోల పరిధిలోనే గతం తరహాలోనే బస్సులు నడుపుతామని, ఇతర రాష్ట్రాలకు ప్రత్యేకంగా బస్సులు నడపడంలేదని ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు.

తండ్రిని హత్య చేసిన కుమారుడికి జీవిత ఖైదు

చివ్వెంల(సూర్యాపేట): తండ్రిని హత్య చేసిన కేసులో కుమారుడికి జీవిత ఖైదు విధిస్తూ సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రాజగోపాల్ గురువారం తీర్పు వెలువరించారు. వివరాలు.. పెన్‌పహాడ్ మండలం జల్మల్‌కుంట తండాకు చెందిన సునావత్ స్వామి, సునావత్ సరోజ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. తన భార్య సరోజతో వివాహేతర సబంధం పెట్టుకున్నాడనే అనుమానంతో స్వామి తన తండ్రి సునావత్ భీక్యాను 2020 మార్చి 28వ తేదీ మధ్యాహ్నం గొడవపడ్డాడు. ఈ క్రమంలో ఇంట్లో ఉన్న మంచం కర్రతో తండ్రి భీక్యా తలపై స్వామి పలుమార్లు కొట్టడంతో అతడు తీవ్రగాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యులు భీక్యాను సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు సాయంత్రం మృతిచెందాడు. భీక్యా పెద్ద కుమారుడు పాండు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి కేసు నమోదు చేసి స్వామిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించి పలువురు సాక్షులను విచారించిన సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రాజగోపాల్ గురువారం పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొంపల్లి లింగయ్య వాదనలతో ఏకీభవిస్తూ నిందితుడు స్వామికి జీవిత ఖైదుతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు లైజన్ ఆఫీసర్ సురేంద్రబాబు, కోర్టు కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు సహకరించారు.

భార్యను చంపిన కేసులో చర్లపల్లి జైలులో నిందితుడు..

జీవిత ఖైదు పడ్డ నిందితుడు స్వామి భార్యను చంపిన కేసులో ప్రస్తుతం హైదరాబాద్‌లోని చర్లపల్లి జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. తండ్రిని చంపిన మూడు నెలలకే బెయిల్‌పై బయటకు వచ్చిన స్వామి భార్యను నరికి చంపాడు. ఈ కేసుకు సంబంధించి గత సంవత్సరం మే నెలలో స్వామికి అప్పటి జిల్లా న్యాయమూర్తి జీవిత ఖైదు విధించారు. కాగా తండ్రి హత్య కేసు లేట్‌గా ట్రయల్ కావడంతో శిక్ష శుక్రవారం పడింది.

గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి

- అలీనగర్‌లో విషాదఛాయలు


నజీర్ (ఫైల్)

హాలియా: హాలియా మున్సిపాలిటీ పరిధిలోని అలీనగర్‌కు చెందిన జాతీయ స్థాయి కబడ్డీ క్రీడాకారుడు, స్పెషల్ ఫోర్స్ కానిస్టేబుల్ షేక్ నజీర్(35) గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. షేక్ నజీర్ జాతీయస్థాయి కబడ్డీ క్రీడాకారుడు. పదేళ్ల క్రితం స్పోర్ట్స్ కోటాలో స్పెషల్ ఫోర్స్‌లో కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం నల్లగొండలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. నజీర్ నల్లగొండ కబడ్డీ అసోసియేషన్ సభ్యుడిగా కూడా కొనసాగుతున్నాడు. విధి నిర్వహణలో భాగంగా నజీర్ నల్లగొండ పట్టణంలోనే కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. గ్రౌండ్‌కు వెళ్లిన ఆయన ఇంటికి తిరిగి వచ్చాక ఛాతిలో నొప్పి రావడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించగా అప్పటికే నజీర్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. నజీర్ మరణవార్తతో అలీనగర్‌లో విషాదచాయలు అలుముకున్నాయి.


నజీర్ మృతదేహానికి గౌరవ వందనం చేస్తున్న పోలీసులు

మృతదేహాన్ని గురువారం సాయంత్రం అలీనగర్‌కు తీసుకువచ్చి పోలీస్ లాంచనాల నడుమ అంత్యక్రియలు నిర్వహించారు.

పలువురి పరామర్శ..

నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డితో పాటు పలువురు జాతీయస్థాయి కబడ్డీ క్రీడాకారులు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ సభ్యులు షేక్ నజీర్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు యడవెల్లి నరేందర్ రెడ్డి, హాలియా మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి, కబడ్డీ క్రీడాకారుడు యడవెల్లి రాంబాబు తదితరులున్నారు.

గురుకుల దరఖాస్తుల గడువు పొడగింపు

రామగిరి(నల్లగొండ): ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 20వ తేదీ గడువు పొడగించినట్లు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల జిల్లా కోఆర్డినేటర్ ఆకుల భిక్షమయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరి 11వ తేదీ ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బీసీ గురుకులాల్లో..

ఉమ్మడి జిల్లాలోని బీసీ గురుకుల పాఠశాలల్లో 6, 7, 8 తరగతుల్లో మిగిలిన సీట్లలో అడ్మిషన్లు పొందేందుకు అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ విద్యార్థులు ఫిబ్రవరి 15వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని ఆర్‌సీఓ షకీనా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.100 చెల్లించి టీటీటీ.ర్జుఙఖీటీట్పజీటట్ప్పు\ఙ్చు.జౌరి.జీ వెబ్‌సైట్ నందు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మార్చి 3న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. వివరాలకు 040–23328266 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి..

నల్లగొండ: గురుకుల విద్యాలయాల్లో ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని నల్లగొండ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, ప్రతిభా కళాశాల(సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్) గంధంవారిగూడెం ప్రిన్సిపాల్ డాక్టర్ లలితకుమారి గురువారం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మొత్తం 39 ప్రతిభా కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో బాలురు, బాలికల నుంచి దరఖాస్తుల స్వీకరణకు నోటిఫికేషన్ విడుదలైనట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్ష రాసేందుకు అర్హులని తెలిపారు. దరఖాస్తు చేసేవారు ఈ ఆగస్టు 31 నాటికి 17 ఏళ్లకు మించి ఉండరాదని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెండేళ్ల మినహాయింపు ఉంటుందన్నారు. దరఖాస్తు రుసుము రూ.200 చెల్లించాలని, దరఖాస్తు చివరి తేదీ ఈనెల 15 వరకు ఉందని తెలిపారు. వివరాలకు www.tswreis.ac.inను సంప్రదించాలని కోరారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 4న, 25న రెండు విడతలుగా ఉంటుందని తెలిపారు.

డీఈఈ సెట్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ షెడ్యూల్

నల్లగొండ: డీఈఈ–సెట్(2023)లో ర్యాంకు సాధించి గతంలో ఫేజ్–1 సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరుకాని వారికి 2023–25 బ్యాచ్‌లో మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు ఫేజ్–2 సర్టిఫికెట్ వెరిఫికేషన్ షెడ్యూల్ విడుదలైనట్లు నల్లగొండ పట్టణంలోని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ కానుగుల నర్సింహ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 17వ తేదీన డైట్ కళాశాలలో ఫేజ్–2 సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసుకునేందుక అవకాశం కల్పించినట్లు తెలిపారు. అదేవిధంగా 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకు డీఈఈ–సెట్(2023)లో సాధించిన ర్యాంకు ప్రకారం వెబ్ ఆప్షన్ల నమోదు, 25వ తేదీన సీట్ల కేటాయింపు, 26వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ఫీజు పేమెంట్, కాలేజీల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందన్నారు. 31వ తేదీన స్లైడింగ్ అనంతరం ఫేజ్–2లో కన్వర్షన్ ప్రకారం సీట్ల కేటాయింపు జరగనుంది. ఫిబ్రవరి 1నుంచి 3 వరకు కన్వర్షన్ అనంతరం కాలేజీల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

కాళేశ్వరంపై సీబీఐ విచారణ ఎందుకు చేయించరు

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతల రామచంద్రారెడ్డి


మాట్లాడుతున్న చింతల రామచంద్రారెడ్డి

నల్లగొండ టూటౌన్: ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టు, విద్యుత్ సంస్థలు, భూ మాఫియాపై సీబీఐ విచారణ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పెద్దలు, అధికారంలోకి వచ్చాక ఇప్పుడు ఎందుకు వెనకడుగు వేస్తున్నారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ప్రశ్నించారు. గురువారం నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలు అమలు చేయకుంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజాకోర్టులో నిలబెడతామని, ఆరు గ్యారంటీల పథకాల కోసం రూ.85 వేల కోట్లు ఖర్చు అవుతుందని, ఈ నిధులు ఎక్కడి నుంచి తెస్తారో, ఎలా అమలు చేస్తారో ప్రభుత్వం శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సీబీఐ విచారణ చేయించాలని అడిగితే మంత్రి ఉత్తమ్ మాట్లాడిన తీరు సరైందికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సీబీఐ విచారణ చేయించాలన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం ఎంత సమయంలో పూర్తి చేస్తారో మంత్రులు చెప్పాలన్నారు. గత ప్రభుత్వం అవినీతి చేసిందనే మిమల్ని గెలిపించారన్నారు. తెలంగాణ అభివృద్ధికి 9 ఏళ్లలో మోదీ ప్రభుత్వం 9 లక్షల కోట్లు ఇచ్చిందన్నారు. రైతుబంధు కోసం బ్యాంకులో ఉన్న రూ.7700 కోట్లు ఎక్కడి పోయాయని ప్రశ్నించారు. సమావేశంలో బండారు ప్రసాద్, కంకణాల శ్రీధర్ రెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి, నూకల నరసింహారెడ్డి, గార్లపాటి జితేంద్రకుమార్, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, జుట్టుకొండ సత్యనారాయణ పాల్గొన్నారు.

జాన్‌పహాడ్ ఉర్సుకు పటిష్ట బందోబస్తు

- సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే


దర్గా వద్ద పార్కింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే

పాలకవీడు: మండలంలో ఈ నెల 25వ తేదీ నిర్వహించనున్న జాన్‌పహాడ్ దర్గా ఉర్సుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. గురువారం జాన్‌పహాడ్ దర్గా వద్ద రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. దర్గాకు ఏయే రూట్‌ల నుంచి భక్తులు చేరుకుంటారు.. వాహనాల రాకపోకలు.. ఎంత మంది భక్తులు వస్తారనేది వక్ఫ్‌బోర్డు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు దర్గాలో ఎస్పీ ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు దర్గా ముజావర్ జానీ స్వాగతం పలికారు. సైదులుబాబా సమాధులపై చాదర్ దట్టీలను సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఉర్సు ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 26న జరగనున్న గంధం ఊరేగింపు, బాబా దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరువుతారని, భక్తులకు ఎక్కడా ఎలాంటి అసౌకర్యం కలగకుండా 500 మంది పోలీసులు, స్పెషల్, రోప్ పార్టీ బలగాలతో బందోబస్తు నిర్వహించనున్నట్లు తెలిపారు. నేరేడుచర్ల, మఠంపల్లి మండలాల నుంచి వచ్చే భక్తులకు జాన్‌పహాడ్ రూట్‌లో, దామరచర్ల నుంచి వచ్చే భక్తులకు శూన్యపహాడ్ రూట్‌లో పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రముఖుల దర్శనానికి ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని డీఎస్పీ ప్రకాష్‌ను ఆదేశించారు. పార్కింగ్ ప్రదేశాలను శుభ్రం చేయించాలని, విద్యుత్, తాగునీటి వసతులు కల్పించాలని వక్ఫ్‌బోర్డు అధికారులకు సూచించారు. ఆయన వెంట ట్రైనీ ఐపీఎస్ రాజేష్ మీణ, డీఎస్పీ ప్రకాష్, సీఐ రామలింగారెడ్డి, ఎస్సై లింగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎం పీఆర్‌ఓగా మామిడాల శ్రీధర్


సీఎం రేవంత్‌రెడ్డితో పీఆర్‌ఓ శ్రీధర్

ఆలేరురూరల్: ఆలేరు మండలంలోని కొలనుపాక గ్రామానికి చెందిన మామిడాల శ్రీధర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పీఆర్‌ఓగా నియమితులయ్యారు. ఈమేరకు గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి పీఆర్‌ఓగా నియమితులైన శ్రీధర్‌కు గ్రామస్తులు, పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

బౌద్ధ ఆరాధన క్షేత్రం బుద్ధవనం


బుద్ధుడి పాదాల వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న జస్టిస్ తశి రబ్‌స్తాన్ దంపతులు

నాగార్జునసాగర్: బుద్ధవనం ప్రపంచ బౌద్ధ ఆరాధన క్షేత్రంగా విరాజిల్లనుందని జమ్మూకశ్మీర్ అండ్ లడక్ హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి, జమ్మూకశ్మీర్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ తశి రబ్‌స్తాన్ అన్నారు. బుధవారం రాత్రి కుటుంబ సమేతంగా నాగార్జునసాగర్‌కు చేరుకున్న వారు గురువారం ఉదయం లాంచీలో వెళ్లి నాగార్జునకొండ మ్యూజియాన్ని సందర్శించారు. అనంతరం బుద్ధవనానికి చేరుకుని బుద్ధుడి పాదాల వద్ద పుష్పాంజలి ఘటించారు. మహాస్థూపంలోని రెండవ అంతస్తులోగల ధ్యానమందిరంలో కాసేపు ధ్యానం చేశారు. అష్టబుద్ధులను దర్శించుకున్నారు. పర్యాటక గైడ్ సత్యనారాయణ వీరికి బుద్ధవనం ప్రత్యేకతలను వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ జమ్మూకశ్మీర్ నుంచి బౌద్ధ మతస్తులు అధిక సంఖ్యలో నాగార్జునసాగర్‌ను సందర్శిస్తుంటారని, తాను బౌద్ధ ఆరాధుడనని తెలిపారు. రాబోయే తరాలకు ఈ ప్రాంతం ప్రపంచ బౌద్ధ ఆరాధన క్షేత్రంగా విరాజిల్లుతుందని పేర్కొన్నారు.

దొంగల ముఠా అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజశేఖర్, ఎస్‌ఐలు సుధీర్, గోపికృష్ణ


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలు

- పట్టపగలు చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితుల రిమాండ్
- 6 తులాల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు స్వాధీనం

నకిరేకల్ : పట్టపగలే తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలు చేస్తున్న ముఠాను నకిరేకల్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. నకిరేకల్ సీఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ మండలం రాములబండ గ్రామానికి చెందిన మంత్రి రామకృష్ణ, కట్టంగూరు మండలం కలిమెర గ్రామానికి చెందిన మేడి విజయ్‌కుమార్, నల్లగొండ పట్టణంలోని సుందరయ్యనగర్ చెందిన గార్లపాటి రాంబాబు ఆన్‌లైన్‌లో పేకాట ఆడుతూ జల్సాలకు అలవాటు పడడంతో పాటు మద్యానికి బానిసయ్యారు. ఈ ముగ్గురిపై గతంలో వేర్వేరు పోలీస్ స్టేషన్లలో చోరీ కేసులు నమోదు కావడంతో పాటు జైలు శిక్ష కూడా అనుభవించారు. గత ఏడాది జనవరి 4వ తేదీన ముగ్గురు జైలు నుంచి విడుదలయ్యారు. వీరు జైలులోనే ముఠాగా ఏర్పడి జైలు నుంచి విడుదల అయ్యాక తిరిగి పట్టపగలు చోరీలకు పాల్పడటం మొదలుపెట్టారు.

చందుపట్లలో చోరీతో గుట్టురట్టు..

రామకృష్ణ, విజయ్‌కుమార్, రాంబాబు ఉదయం వేళ గ్రామాలు, పట్టణాల్లో తిరుగుతూ తాళం వేసిన ఇళ్లను గుర్తించి చోరీలకు పాల్పడేవారు. నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామానికి చెందిన ఆలకుంట్ల వెంకటేశ్వర్లు ఈ నెల 7వ తేదీన అయ్యప్ప పూజ ఉందని ఇంటికి తాళం వేసి నకిరేకల్‌కు వెళ్లాడు. ముగ్గురు నిందితులు అదే రోజు తాళం వేసిన ఉన్న ఆలకుంట్ల వెంకటేశ్వర్లు ఇంట్లో పట్టపగలు చోరీకి పాల్పడి 6 తులాల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, కొంత నగదును ఎత్తుకెళ్లారు. అనంతరం వీరు తమ అవసరాల కోసం నల్లగొండలోని దేవరకొండ రోడ్డులో గల ముత్తూట్ ఫైనాన్స్‌లో విజయ్‌కుమార్ పేరు మీద కొన్ని బంగారు ఆభరణాలు కుదవపెట్టి వచ్చిన డబ్బులను పంచుకున్నారు. బాధితుడు వెంకటేశ్వర్లు చోరి జరిగిన మరుసటి రోజు నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న నకిరేకల్ ఎస్‌ఐ సుధీర్, కానిస్టేబుళ్లు వై. వెంకటేశ్వర్లు, మధుకర్ ఒక టీంగా ఏర్పడి టెక్నాలజీ సహాయంతో చోరీకి పాల్పడింది రామకృష్ణ, విజయ్‌కుమార్, రాంబాబు అని గుర్తించారు. ముగ్గురు నిందితులు ఎక్కడెక్కడ సంచరిస్తున్నారనే సమాచారాన్ని టెక్నాలజీ సహాయంతో తెలుసుకున్న పోలీసులు గురువారం నకిరేకల్ మండలం చందంపల్లి గ్రామ స్టేజీ వద్ద సూర్యాపేట వైపు స్కూటీపై వెళ్తున్న ముగ్గురు నిందితులను వెంబడించి పట్టుకున్నారు. వారిని విచారిస్తే చందుపట్లలో చోరీ చేసిన కొన్ని బంగారు ఆభరణాలను సూర్యాపేటలో అమ్మేందుకు వెళ్తున్నామని నేరం అంగీకరించారు. నిందితుల నుంచి యాక్టీవా బైక్, నాలుగు సెల్‌ఫోన్లు, ఆరు తులాల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు. ముగ్గురిని రిమాండ్‌కు పంపామని పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్‌ఐ సుధీర్ టీంను, వారికి సహకారం అందించిన ఎస్‌ఐ గోపికృష్ణ, కానిస్టేబుళ్లు వెంకటేశ్వర్లు, మధుకర్‌ను సీఐ అభినందించారు. సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్లేవారు తమ ఇంట్లోని విలువైన వస్తువులను తమ వెంట తీసుకెళ్లాలని సీఐ రాజశేఖర్ సూచించారు. అదేవిధంగా తాళం వేసి వెళ్లే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.